నమస్తే తెలంగాణ
వరంగల్
5 | వరంగల్, మంగళవారం 29 ఏప్రిల్ 2025 | WARANGAL

# సమష్టి కృషితో సభ విజయవంతం

- బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం
- కేసీఆర్ మాటలతో కాంగ్రెస్ నాయకుల్లో గుబులు
- ఎన్నికలేవైనా బీఆర్ఎస్‌దే గెలుపు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



దేవరుప్పుల, ఏప్రిల్ 28 : సమష్టి కృషితో బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతమైందని, పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సభ సక్సెస్ కావడంతో సోమవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సభ విజయవంతం కోసం చెమటోడ్చి పనిచేశారని, ఆ కష్టానికి తగిన ప్రతిఫలం కనిపించిందన్నారు. బీఆర్ఎస్‌పై జనంలో ఊపు ఉన్నదని, కాంగ్రెస్ సర్కారుపై తీవ్ర వ్యతిరేకత ఉందని ఈ సభ ద్వారా రుజువైందన్నారు. లక్షల్లో ఉన్న జనాన్ని సభలో చూస్తుంటే ఉద్యమ సమయంలో కేసీఆర్ సభలు కళ్లముందు కదలాడాయన్నారు. కేసీఆర్ మాటల తూటాలతో కాంగ్రెస్ నాయకుల గుండెల్లో గుబులు మొదలైందన్నారు. సభను సక్సెస్ చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కార్యకర్త నుంచి నాయకుడి వరకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. సభా ప్రాంగణం చేరకుండానే ట్రాఫిక్ జామ్‌తో లక్షలాది మంది కిలోమీటర్ల దూరంలోనే నిలిచిపోయారని అన్నారు. కేసీఆర్ మరోమారు ముఖ్యమంత్రి కావాలని, తెలంగాణ అభివృద్ధి పథంలో వికసించాలనే ఆకాంక్ష జనంలో కనిపించిందన్నారు. స్వచ్ఛందంగా కదిలిన జనాన్ని చూస్తుంటే రేవంత్ సర్కారుపై ఉన్న వ్యతిరేకత బయటపడిందని ఎర్రబెల్లి అన్నారు. ఇక ముందు ఎన్నికలు ఏవైనా బీఆర్ఎస్ గెలుపు ఖాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలంటే కాంగ్రెస్ సర్కారుకు వణుకు పుట్టడం ఖాయన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లాల వరకు నూతన కమిటీలు ఏర్పాటు చేస్తే తిరుగులేని శక్తిగా బీఆర్ఎస్ అవతరిస్తుందన్నారు. పాలకుర్తి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని, తాను చెప్పగానే స్వచ్ఛందంగా ఉప్పెనలా కదలివచ్చిన అందరికీ రుణపడి ఉంటానన్నారు.

**అధికార పార్టీ పెద్దల డైరెక్షన్‌లో** బీఆర్ఎస్ సభకు మొదటినుంచీ అడ్డంకులు సృష్టిస్తూనే వచ్చారు. ప్రతిష్ఠాత్మక సభ కావడంతో లక్షలాదిగా జనం తరలివస్తారనే అంచనాలుండడంతో ముందుగానే దరఖాస్తు చేసినా కుట్రలతో అనుమతి ఇచ్చేందుకూ కాలయాపన చేయడమే గాక ఎప్పుడూ లేని విధంగా వరంగల్ నగర పరిధిలో 'సిటీ పోలీస్ యాక్ట్' తీసుకురావడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. చివరకు హైకోర్టు జోక్యంతో తప్పనిసరి పరిస్థితుల్లో అనుమతి ఇచ్చి.. సభ రోజున 1100మంది పోలీసులు ఉంటారని సీపీ ప్రకటించినప్పటికీ బందోబస్తు, ట్రాఫిక్ నిర్వహణలో అంతులేని నిర్లక్ష్యం కనిపించింది. పేరుకు వెయ్యి మంది అని చెప్పినా క్షేత్రస్థాయిలో అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం, లారీలు అడ్డుపెట్టడం, ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడంలో నిర్లక్ష్యం.. ఇంకొందరైతే మొక్కుబడిగా డ్యూటీ చేయడం, సభా గ్యాలరీలోకి ప్రజలను కావాలనే పంపకపోవడం.. ఇలా అనేక కారణాలు పోలీసుల ఘోర వైఫల్యాన్ని ఎత్తిచూపుతున్నాయి. పోలీసుల నిర్వాకం ఫలితంగా ఆదివారం లక్షలాది మంది ఎల్కతుర్తి సభకు వచ్చి, వెళ్లేటప్పుడు నగర నలుదిక్కులా ట్రాఫిక్ చక్రబంధంలో ఇరుక్కుపోయి గంటలకొద్దీ నరకం చూడాల్సిన పరిస్థితి రాగా.. అటు పోలీసులు తీరు, కాంగ్రెస్ సర్కారు కుట్రలపై ప్రజానీకం దుమ్మెత్తి పోస్తోంది. - సుబేదారి, ఏప్రిల్ 28

# పోలీస్ ఫెయిల్


దేవన్నపేట టోల్‌ప్లాజా వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు (ఫైల్)

- సభకు అనుమతి నుంచి బందోబస్తు వరకు సుస్పష్టం
- అధికార పార్టీ ఒత్తిళ్లతో అడుగడుగునా అడ్డంకులు
- రోడ్లపై వాహనాలు నిలిపి ట్రాఫిక్‌జామ్‌కు కారణం
- క్లియర్ చేయకుండా చేతులెత్తేసిన వైనం
- సభకు వచ్చేప్పుడు.. తిరిగి వెళ్లేటప్పుడూ ఇదే పరిస్థితి
- అర్ధరాత్రి వరకు ఇబ్బందులు పడిన ప్రజలు
- కాంగ్రెస్ సర్కారు, పోలీసులపై దుమ్మెత్తి పోసిన జనం


ప్రజలను గ్యాలరీలోకి పంపాలని సభా వేదికపై నుంచి మైక్‌లో పోలీసులను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి (ఫైల్)

ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. ప్రతిపక్ష పార్టీ సభకు అధికార పక్షం పెద్దల డైరెక్షన్‌లో పోలీసు అధికారులు మొదటినుంచీ అడ్డంకులు సృష్టించారు. అయినా ప్రజలు లక్షలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేశారు. వరంగల్‌లో రజతోత్సవ సభ నిర్వహిస్తామని అధినేత కేసీఆర్ ప్రకటించగానే అధికార పార్టీ పెద్దలు కుట్రలకు తెరలేపారు. పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మార్చి 28న వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో సభ అనుమతి కోసం దరఖాస్తు చేయగా ఇవ్వకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ కమిషనరేట్ పరిధిలో నెల రోజుల పాటు సిటీ పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని, అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించొద్దని ఈ నెల 5న ఉత్తర్వులు జారీచేశారు. దీంతో 9న దాస్యం హైకోర్టును ఆశ్రయించడంతో ఈ నెల 12న సీపీ సభ అనుమతి దరఖాస్తును పరిశీలిస్తున్నామని ప్రకటన విడుదల చేయడంతో పాటు మరుసటి రోజు అనుమతి మంజూరు చేశారు.

### కర్తవ్య నిర్వహణలో నిర్లక్ష్యం

సభ బందోబస్తు విషయమై పోలీసులు తమ కర్తవ్యాన్ని నిర్వహించడంలో నిర్లక్ష్యం వహించారు. 1100 మంది పోలీసులు విధుల్లో ఉంటారని సీపీ అధికారికంగా ప్రకటించినప్పటికీ ఎక్కడ కూడా డ్యూటీ చేసినట్లు కనిపించలేదు. స్టేజీ వద్ద ఓ డీసీపీ, మరో అదనపు డీసీపీ విధుల్లో ఉన్నారు. 8మంది ఏసీపీల్లో ఒకరు స్టేజీ మీడియా గ్యాలరీ వెనుక ఉండగా, మిగతా వారు తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరించారు. ఇక ఇద్దరు ఏసీపీలైతే సిద్దిపేట రూట్‌లో రోడ్డుపైకి లారీలు వదిలి సభకు వచ్చే వాహనాలను అడ్డుకున్నారు. మరో ఏసీపీ, నలుగురు ఇన్‌స్పెక్టర్లు సిద్దిపేట వైపు నుంచి వచ్చే ప్రజలు సభా ప్రాంగణం ఎడమ వైపు రోడ్డుకు దగ్గరగా ఉన్న గ్యాలరీలోకి రాకుండా బారికేడ్లు అడ్డుపెట్టారు. దీనిని గుర్తించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వారిని గ్యాలరీలోకి పంపాలని పదే పదే మైకులో అభ్యర్థించినా పోలీసులు పట్టించుకోలేదు. దీంతో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి వెళ్లి బారికేడ్లను తెరిపించారు.

### అడుగడుగునా ట్రాఫిక్ జామ్

వరంగల్, సిద్దిపేట, కరీంనగర్ రూట్లలో సాయంత్రం 5 గంటల నుంచి సభకు వచ్చే వాహనాలు 10 నుంచి 15కిలోమీటర్ల వరకు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. సిద్దిపేట రూట్‌లో పోలీసులు లారీలకు అనుమతి ఇవ్వడంతో వందలాది వాహనాలు ముందుకు కదలలేదు. ఇటు వరంగల్ రూట్‌లో హసన్‌పర్తి మీదుగా ఔటర్ రింగ్‌రోడ్డు వరకు నిలిచిపోయాయి. చాలామంది పోలీసులు ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేయకుండా తమ వాహనాల్లోనే కూర్చున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా జనగామ, ములుగు, పరకాల, వరంగల్ సిటీ, హైదరాబాద్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి వచ్చిన వాహనాలు ఔటర్ రింగ్ రోడ్డు పై నుంచి ఎల్కతుర్తి వరకు నిలిచిపోయినా ఏ ఒక్క పోలీసు అధికారి పట్టించుకోలేదు.


ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి (ఫైల్)

### తిరుగు ప్రయాణంలోనూ అంతే..

సభ ముగిసిన తర్వాత తమ గమ్యస్థానాలకు వెళ్లే ప్రజలు పోలీసుల పట్టింపులేని తనంతో అనేక ఇబ్బందులు పడ్డారు. ఒకవైపు రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు ముందుకు వెళ్లకపోవడంతో పార్కింగ్‌లోని వాహనాలు రోడ్డుపైకి రాలేకపోయాయి. రోడ్డుపై నిలిచిన వాహనాలను పోలీసులు క్లియర్ చేయకుండా చేతులెత్తేయడంతో అర్ధరాత్రి వరకు ప్రజలు ట్రాఫిక్‌జామ్‌లోనే చిక్కుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు, వలంటీర్లు వచ్చి ట్రాఫిక్‌ను చక్కదిద్దడంతో వాహనాలు ముందుకు వెళ్లాయి. కాగా, సభకు హాజరైన ప్రజల నుంచి పోలీసులు అనేక విమర్శలు ఎదుర్కొన్నారు. బందోబస్తు నుంచి ట్రాఫిక్ క్లియర్ చేయడం వరకు ఏ ఒక్క పోలీసు అధికారి పట్టించుకోలేదని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లే కారణమని దుమ్మెత్తిపోశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కుట్రలు చేసినా సభ ఆగలేదని, లక్షలాది మంది జనం హాజరై విజయవంతం చేశారని, దటీజ్ కేసీఆర్ అంటూ కొనియాడారు.


బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, పక్కన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, నాయకులు

- రజతోత్సవాన్ని విజయవంతం చేసిన అందరికీ వందనం
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్
- పోలీసులు యూజర్ చార్జీలు తీసుకున్నరు
- ఇప్పటి వరకు ఏ సభకూ జరగలేదు
- అడుగడుగునా ట్రాఫిక్ జామ్ చేశారు
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- చరిత్రాత్మక సభలకు వేదికగా వరంగల్
- రేవంత్ ప్రభుత్వానికి సభ చెంపపెట్టు
- ముగ్గురు మంత్రులు సిగ్గులేకుండా ప్రెస్‌మీట్ పెట్టారు
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

# ప్రజల గుండెల్లో కేసీఆర్

## మహాసభకు స్వచ్ఛందంగా తరలివచ్చిన సబ్బండ వర్గాలు

హనుమకొండ, ఏప్రిల్ 28 : 'బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతం చేసిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. అరవై ఏండ్ల తెలంగాణ ప్రజల కలను సాకారం చేసిన మహనీయుడు కేసీఆర్. త్యాగాల పునాదులపై రాష్ర్టాన్ని సాధించిన పార్టీ అధినేత కేసీఆర్ తన పదేండ్ల పాలనలో రాష్ర్టాన్ని దేశంలోనే అగ్రభాగాన నిలిపారు. ప్రజల గుండెల్లో ఇప్పటికీ చెరగని ముద్ర వేసుకున్నారు' అని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎల్కతుర్తిలో నిర్వహించిన రజతోత్సవ సభకు ప్రతి పల్లె, పట్టణం నుంచి లక్షలాది మంది స్వచ్ఛందంగా తరలివచ్చి దేశంలో ఎక్కడాలేని విధంగా విజయవంతం చేశారని, అందుకు వారికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఒకే ఒక్కడిగా బయలుదేరిన కేసీఆర్ 14 ఏండ్లు తెలంగాణ అంతటా కలియదిరిగి, సమస్యలను గుర్తించడంతో పాటు తెలంగాణ ఏర్పాటు అనంతరం వాటిని పరిష్కరిస్తూ పదేండ్లలో దేశమే రాష్ట్రం వైపు చూసేలా అభివృద్ధి చేశారన్నారు. ప్రస్తుతం 16 నెలలుగా ప్రతిపక్ష పాత్రను విజయవంతంగా పోషిస్తున్నామని తెలిపారు. మ్యానిఫెస్టోలో పెట్టని సంక్షేమ పథకాలను సైతం అమలు చేశామని గుర్తు చేశారు. కేసీఆర్‌కు ప్రజల కష్టసుఖాలు తెలవడం, నిరుపేద ఆడపిల్లల పెళ్లికి ఎన్నో ఇబ్బందులుంటాయని కల్యాణ లక్ష్మి పథకాన్ని అమలు చేశారని తెలిపారు. రజతోత్సవ సభకు ప్రజలు సైకిళ్లు, టూ వీలర్స్, ఆటోలు, ఎండ్ల బండ్లు, పాదయాత్ర చేసుకుంటూ తరలివచ్చారన్నారు. హనుమకొండ జిల్లాలో సభ నిర్వహించేందుకు సహకరించిన కెప్టెన్ లక్ష్మీకాంతారావు కుటుంబ సభ్యులు, సభ కోసం భూములిచ్చిన స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. సభ సందర్భంగా ఎవరికైనా ఇబ్బందులు కలిగిస్తే మన్నించాలని దాస్యం విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ కే వాసుదేవరెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్ బొందు అశోక్‌యాదవ్, నాయకులు బీరెల్లి భరత్‌కుమార్, నయీముద్దీన్, సల్వాజి రవీందర్ రావు, వీరేందర్, పోలపెల్లి రామ్మూర్తి, రఘు తదితరులు పాల్గొన్నారు.

### ఆదివారం ఆర్టీవోల విధులు

ఇప్పటి వరకు ఏ సభకు లేని విధంగా బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పోలీసులు యూజర్ చార్జీలు తీసుకున్నరు. ఇప్పటి వరకు ఏ సభకూ జరగలేదు. 2 వేల మంది పోలీసులను బందోబస్తులో ఉంచుతామని కనీసం 200 మందిని ఏర్పాటు చేయలేదు. దరఖాస్తు చేసిన 10 రోజుల వరకు సభకు అనుమతి ఇవ్వకుంటే కోర్టు ద్వారా తెచ్చుకున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా సభ ఏర్పాట్లను పూర్తి చేసి విజయవంతం చేశాం. పోలీసులు విఫలం కావడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో మేము రోడ్లపై విధులు నిర్వర్తించాల్సి వచ్చింది. మేము బారికేడ్‌లు పెట్టాలన్న చోట కాకుండా ఎక్కడెక్కడో పెట్టి ఇబ్బందులకు గురిచేశారు. సాధారణంగా ఆదివారం ఎన్నడూ డ్యూటీకి రాని ఆర్టీవోలు విధులు నిర్వర్తించారు. వరంగల్, భూపాలపల్లిలో ఎన్నడూ లేని విధంగా జాబ్ మేళాలు పెట్టారు. ప్రజల్లో కేసీఆర్‌కు ఉన్న అభిమానాన్ని ఎవరూ చెరిపేయలేరు. మా సభను ఫెయిల్ చేయాలని కుట్రలు చేసినా కేసీఆర్‌ను చూడాలని, ఆయన మాటలు వినాలని ప్రజలు, యువత కిలోమీటర్ల దూరం నుంచి నడుచుకుంటూ వచ్చారు. సభ కోసం భూములిచ్చి సహకరించిన స్థానిక రైతులకు ధన్యవాదాలు. ఇంతకు ముందు వారి భూములు ఎలా ఉన్నాయో అలాగే చేసిచ్చే, పొలాల కాల్వలు, హద్దులు ఏర్పాటు చేసే బాధ్యత మాదే. సభ నిర్వహణలో భాగస్వాములైన మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌తో పాటు ఆయన క్యాడర్‌కు, దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గ్యాదరి బాలమల్లుకు ప్రత్యేక కృతజ్ఞతలు. ఏ ఒక్క పోలీసు సహకరించకున్నా రోజంతా కష్టపడి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా పనిచేసిన మా కార్యకర్తలందరికీ ధన్యవాదాలు. మన ఇంట్లో ఫంక్షన్ చేసినా కొన్ని పొరపాట్లు జరుగుతాయి. ఇక్కడ కూడా ఏమైనా జరిగితే క్షమించాలి.
-పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ


సభ సక్సెస్ అయినందున స్వీట్లు తినిపించుకుంటున్న ఎమ్మెల్సీ పోచంపల్లి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది, దాస్యం

### పూర్తిగా విఫలమైన పోలీసులు

చరిత్రాత్మక సభలకు వేదికగా నిలిచిన ఓరుగల్లు రజతోత్సవ సభను విజయవంతం చేసి మరోసారి చరిత్రలోకి ఎక్కింది. సభ నిర్వహించేందుకు అవకాశం కల్పించిన కేసీఆర్, కేటీఆర్‌తో పాటు భాగస్వాములైన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు. సభను విఫలం చేయాలనుకున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చెంప పెట్టుగా లక్షలాది మంది ప్రజలు తరలివచ్చి విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు. కేసీఆర్‌కు దేవుడి ఆశీస్సులున్నాయి. ప్రకృతి సైతం సహకరించింది. ఎన్నడూ డ్యూటీలు చేయని ఆర్టీవోలు ఆదివారం రోడ్లపైకి వచ్చి, చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించారు. సభకు బస్సులు పంపితే జరిమానా వేస్తామని ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలను బెదిరించారు. నా నియోజకవర్గంలో ఒక్క బస్సు ఇవ్వకుండా చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యే చిల్లరగా వ్యవహరిస్తూ సభను చెడగొట్టే ప్రయత్నం చేశారు. పోలీసు వ్యవస్థ పూర్తిగా విఫలమైంది. పోలీసు విధులు మేము నిర్వర్తించాం. పోలీసులు అధికార పార్టీ చెప్పుచేతల్లో ఉండి దిగజారిపోయారు. సాయంత్రం 5 గంటల వరకే పోలీసులు చేతులెత్తేయడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ప్రభుత్వ ఒత్తిడి మేరకే పోలీసులు ఇలా వ్యవహరించారు. డ్యూటీలో ఉన్న కొద్దిమంది పోలీసులు సభకు వచ్చే జనాలను అడ్డుకున్నారు. సభా వేదిక వద్ద ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు, ఒక హెడ్ కానిస్టేబుల్ మాత్రమే ఉన్నారు. 2 వేల మంది పోలీసులు ఎక్కడ డ్యూటీ చేశారో మేము పెట్టిన సీసీ కెమెరాల్లో చూస్తే తెలుస్తుంది. సభా వేదిక వద్ద భద్రత లేదు. కేసీఆర్‌కు ఏమైనా జరిగితే బాధ్యులెవరు? సభ పూర్తయిన 5 నిమిషాలు కాక ముందే మంత్రులు పొంగులేటి, సీతక్క, జూపల్లి సిగ్గులేకుండా ప్రెస్‌మీట్ పెట్టారు. మా పార్టీ పుట్టిన రోజు సభ పెట్టుకుంటే దానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నరు. ఒక మంత్రి మేము కుట్ర చేస్తే అంత మంది ఎలా వచ్చారంటే, మరో మంత్రి అసలు జనమే రాలేదంటున్నరు. మేము రైతుల నుంచి అనుమతి తీసుకున్న భూమిలో సిగ్గులేకుండా కాంగ్రెస్ పార్టీ హోర్డింగ్‌లు పెట్టారు. ములుగురోడ్ వద్ద బస్సుల్లో వెళ్తున్న వారిని ఆర్టీవో సిబ్బంది ఆపి ఎండలో నిల్చోబెట్టారు. టోల్‌గేట్‌ల వద్ద కావాలని వాహనాలు నిలిపివేశారు. మా పాలనలో ఎవరికీ ఇలా ఇబ్బంది కలిగించలేదు. సభకు సహకరించిన ఎల్కతుర్తి రైతులు, భాగస్వాములైన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు. – పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

# దేశ చరిత్రలోనే అతిపెద్ద సభ

- విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు
- జనాన్ని చూసి కాంగ్రెస్ ప్రభుత్వం హడలెత్తింది
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 28 : బీఆర్ఎస్ రజతోత్సవ సభ దేశ చరిత్రలోనే అతిపెద్దదిగా నిలిచిపోతుందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ప్రకృతి సైతం సహకరించిందని, సభ పూర్తయ్యే వరకు చల్లటి వాతావరణం నెలకొందన్నారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గండ్ర పాల్గొని మాట్లాడారు. సభ విజయవంతానికి కృషి చేసిన నియోజకవర్గ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు కేసీఆర్ వివరిస్తే కొంతమంది మంత్రులు ఆయన మాటలను విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ఇప్పటివరకు ఎంతమందికి ఇచ్చారో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు విలన్‌లాగా కనబడుతున్నదన్నారు. రజతోత్సవ సభకు వచ్చిన జనాన్ని చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం హడలెత్తుతున్నదని, ఆ భయంతోనే భూపాలపల్లి, మంథని, బెల్లంపల్లి నియోజకవర్గాల జనాలు సభకు వెళ్లకుండా ఉప్పల్, బావుపేట రైల్వే గేట్లను మూసివేసిందన్నారు. పోలీసులను ఎంత అభ్యర్థించినా తమ మాట వినలేదని, సభలో వారి సహాయ నిరాకరణ స్పష్టంగా కనపడిందన్నారు. తాము ప్రశ్నిస్తేనే కాంగ్రెస్ సర్కారు అల్లాడుతున్నదని, కేసీఆర్ ప్రశ్నిస్తే సీఎం రేవంత్ తట్టుకోగలడా? అని ప్రశ్నించారు. ఏది ఏమైనా కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ కాలంలోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవడం ఖాయమన్నారు. అలాగే ప్రజలంతా కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని, వచ్చే శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలుస్తుందని గండ్ర అన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ మేకల సంతోష్‌కుమార్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ నూనె రాజు పటేల్, మాజీ కౌన్సిలర్లు తిరుపతి, రవికుమార్, పూలమ్మ, నాయకులు సిద్ధు, బేబి, పొలసాని లక్ష్మీ నరసింహారావు, కరీం, కరుణాకర్‌రెడ్డి, బుర్ర సదానందం, చిరంజీవి, మాడ హరీశ్‌రెడ్డి, రాజు, బుర్ర కుమారస్వామి, సుధాకర్ పాల్గొన్నారు.

# కేసీఆర్‌ను విమర్శించే స్థాయి సీతక్కకు లేదు

- గిరిజన దొరసానిలా నియంతపాలన
- మాట వినని అధికారులకు బదిలీలతో బెదిరింపులు
- ప్రసంగంలో పసలేనప్పుడు మంత్రులకు ఉలికిపాటెందుకో?
- విలేకరుల సమావేశంలో బడే నాగజ్యోతి ఫైర్


మాట్లాడుతున్న బడే నాగజ్యోతి

ములుగు, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను విమర్శించే స్థాయి మంత్రి సీతక్కకు లేదని, సంక్షేమం, ఇచ్చిన హామీలను మరిచి ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి హెచ్చరించారు. సోమవారం ములుగు జిల్లాలోని బీఆర్ఎస్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎల్కతుర్తిలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు లక్షలాది మంది కేసీఆర్‌కు బ్రహ్మరథం పట్టారని అన్నారు. గత ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమాన్ని వివరించడంతోపాటు దొంగ వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ హామీలను కేసీఆర్ గుర్తు చేశారని అన్నారు. కేసీఆర్ ప్రసంగంలో పస లేదని విమర్శించిన సీతక్క కాంగ్రెస్ ప్రభుత్వంలో పస లేదన్న విషయాన్ని గుర్తెరుగాలన్నారు. ప్రసంగంలో పసలేనప్పుడు కాంగ్రెస్ మంత్రులు, నాయకులకు అంత ఉలిక్కిపాటు ఎందుకని ప్రశ్నించారు. సీతక్క మంత్రిగా వ్యవహరిస్తున్న శాఖలో ఉపాధి హామీ ఉద్యోగులకు ఐదు నెలలుగా వేతనాలు అందక గోసపడుతున్నారని అన్నారు. ఉచిత బస్సు ప్రయాణాల్లో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేసీఆర్ వివరిస్తే, ఉచిత బస్సు పథకాన్ని ఓర్వడం లేదని సీతక్క మొసలి కన్నీరు కార్చడం సరి కాదని, ఒకసారి బస్సు ఎక్కి మహిళల బాధలను తెలుసుకోవాలన్నారు. బస్సుల సంఖ్యను పెంచి ఫ్రీ బస్సును అందిస్తే మహిళలకు న్యాయం జరుగుతుందన్నారు. బస్సులను తగ్గించి ఫ్రీ బస్సు అనడం సరి కాదని విమర్శించారు. గిరిజన దొరసానిలా వ్యవహరిస్తున్న సీతక్క ములుగు జిల్లాలో నియంత పాలన సాగిస్తూ ప్రశ్నించే వారిపై కేసులు పెడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను చెప్పిన మాట వినని అధికారులను బదిలీ చేయిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నదన్నారు. గత ప్రభుత్వాన్ని విమర్శించడం మాని ప్రజలకిచ్చిన గ్యారెంటీలు అమలు చేయడంలో శ్రద్ధ చూపాలని హితవు పలికారు.

### ఆపరేషన్ కగార్‌ను ఆపాలి

ములుగు జిల్లా పరిధి కర్రెగుట్టలపై వారం రోజులుగా కేంద్ర బలగాలతో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపాలని నాగజ్యోతి డిమాండ్ చేశారు. అమాయక ఆదివాసీలను మట్టుబెట్టేందుకు కుట్ర జరుగుతుందన్నారు. రజతోత్సవ సభలో కేసీఆర్ డిమాండ్ చేసిన విధంగా ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపేసి, మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలన్నారు. దేశ సరిహద్దుల్లో విధులు నిర్వర్తించే కేంద్ర బలగాలతో దేశ పౌరుల మీద దాడులు చేయించడం సమంజసం కాదన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, నాయకులు గొర్రె సమ్మయ్య, దుర్గం రమణయ్య, మేర్గు సంతోశ్, బైకాని సాగర్, గజ్జి నగేశ్, కవ్వంపెల్లి బాబు, మాదం సాగర్, బుర్రి స్వరూప, సురేందర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

# నిన్నటిదాకా ఒక లెక్క.. ఇకనుంచి ఇంకో లెక్క

### మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 28 : అమలు కాని హామీలిచ్చి, ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కహానీలు ఇక సాగవని, నిన్నటివరకు ఒక లెక్క, ఇప్పటి నుంచి ఇంకో లెక్క అని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందుగా పహల్గాంలో ఉగ్రదాడికి బలైన వారికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం ఎల్కతుర్తి రజతోత్సవ సభను విజయవంతం చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పార్టీ తరపున రాజయ్య కృతజ్ఞతలు తెలిపారు. సభ విజయవంతం కావడానికి కృషిచేసిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. సభను ఫెయిల్ చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు ఎన్నో కుటిల ప్రయత్నాలు చేసినా ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేశారని, జనం గుండెల్లో కేసీఆర్ ఉన్నారని చెప్పేందుకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. కర్రెగుట్టలో జరుగుతున్న ఎన్‌కౌంటర్లను ఆపాలని, మావోయిస్టులతో చర్చలు జరపాలని బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలను బీఆర్ఎస్ తరపున రాజయ్య డిమాండ్ చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల అవసరాలకనుగుణంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి కేసీఆర్ జనరంజక పాలన అందించారని, కానీ కాంగ్రెస్ సర్కారు మాత్రం ప్రజాకంటక పాలన కొనసాగిస్తున్నదన్నారు. రాహుల్ గాంధీతో రైతు డిక్లరేషన్, ఖర్గేతో ఎస్సీ రిజర్వేషన్, సోనియా గాంధీతో ఎన్నికల మ్యానిఫెస్టో చేయించి ప్రజల నమ్మకాన్ని ఖూనీ చేశారని రాజయ్య విమర్శించారు. 16 నెలల కాంగ్రెస్ పాలనలో సంక్షేమ పథకాల అమలులో దేవుళ్లపై ఒట్లు పెట్టి, హామీలు నెరవేర్చలేదన్నారు. ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం లక్షా 60వేల కోట్లు అప్పుతెచ్చి రాహుల్‌గాంధీకి కమీషన్ పంపారని రాజయ్య ఆరోపించారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకొన్న గ్రామంలో ఏ ఒక్క పథకాన్ని సంపూర్ణంగా అమలుచేయలేదన్నారు. హామీలు నెరవేర్చే వరకు ప్రజలతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీస్తామన్నారు. అధికారులు చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దని, అతిగా ప్రవర్తించే అధికారులు భవిష్యత్ లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు అక్రమ కేసులకు భయపడవద్దని, బీఆర్ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్, మాజీ జడ్పీటీసీలు రవి, కీర్తి వెంకటేశ్వర్లు, ఆకుల కుమార్, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ చందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, కమలేశ్, హీరాసింగ్, పావని, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.